
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

బుధవారం 9 జులై 2025

చిన్నారుల్ని చిదిమేసిన నిర్లక్ష్యం

కడలూరు జిల్లాలో ఘోర ప్రమాదం

- గేటు వేయని కీపర్
- పట్టాలపై ఇరువైపులా చూడకుండా దాటేందుకు యత్నించిన బస్సు డ్రైవర్
- స్కూల్ బస్సును ఢీకొన్న రైలు
- ముగ్గురు చిన్నారుల దుర్మరణం
- మృతుల్లో అన్నాచెల్లెలు



చెళియన్, చారుమతి, విశ్వేష్ (ఫైల్‌ఫోటోలు)



చారుమతి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



మృతదేహాన్ని స్ట్రెచర్‌లో తరలిస్తున్న పోలీసులు



విలపిస్తున్న మృతుల కుటుంబీకులు

బడికెళ్లొస్తామంటూ తల్లిదండ్రులకు టాటా చెప్పిన ఆ చిన్నారులు .. అంతలోనే అనంతవాయువుల్లో కలిసిపోయారు. స్కూలు యూనిఫారం ధరించి, పుస్తకాలు, లంచ్ బ్యాగుతో భవిష్యత్‌ను వెతుక్కుంటూ బయలుదేరిన ఆ బావిభారత పౌరులు.. రైల్వే గేటు కీపర్, బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి బలైపోయారు. గేటు వేయని రైలు పట్టాలను గమనించకుండానే ట్రాక్ దాటుతున్న బస్సును రైలు ఢీకొనడంతో ముగ్గురు చిన్నారులు ఛిద్రమైపోయారు. మరొకరు మృత్యువుతో పోరాడుతున్నారు. కడలూరు జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘోర ప్రమాదంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

కడలూరు జిల్లా సెమ్మంకుప్పంలో మంగళవారం ఉదయం 'ఆచార్య ప్రైవేట్ స్కూలు' వ్యాన్ నలుగురు చిన్నారులతో బయలుదేరింది. ఊరిబయట రైల్వే గేట్ వద్ద ఉదయం 7.45 గంటల ప్రాంతంలో గేటు తెరిచివుండడంతో బస్సు డ్రైవర్ శంకర్ (47) ఏమాత్రం రైలు పట్టాలను పరిశీలించకుండా ముందుకెళ్లాడు. అదే సమయంలో తిరుచెందూరు నుంచి చెన్నై వైపు వస్తున్న ప్యాసింజర్ రైలు ఆ బస్సును ఢీకొని కిలోమీటరు వరకు ఈడ్చుకుంటూ వెళ్లింది. మధ్యమధ్యలో బస్సు పల్టీలు కొట్టుకుంటూ నుజ్జునుజ్జయిపోయింది. ఈ ఘటనలో చారుమతి (15), నిమలేష్ (12) అనే ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. చారుమతి శరీరం ముక్కలుముక్కలైపోయింది. తీవ్రంగా గాయపడిన వ్యాన్ డ్రైవర్ శంకర్ (47), విద్యార్థి చెళియన్ (16), విశ్వేష్ (16)లను చికిత్స నిమిత్తం పుదుచ్చేరి జిప్మర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక చెళియన్ మృతి చెందాడు. చెళియన్, చారుమతి అన్నాచెల్లెళ్లు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

ఈ ప్రమాదం గురించి సమాచారం అందగానే జిల్లా కలెక్టర్ సిబి ఆదిత్య, పోలీసు ఉన్నతాధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

సీఎం సంతాపం...

ఈ రైలు ప్రమాదంపె ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థుల కుటుంబీకులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తలా రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందజేయనున్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడినవారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50వేల చొప్పున సాయం ప్రకటించారు. ఇదే విధంగా అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, టీవీకే నేత విజయ్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్, ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం, పీఎంకే నేతలు రాందాస్, అన్బుమణి తదితర నేతలు తీవ్ర సంతాపం ప్రకటించారు.

రైల్వే శాఖ సాయం..

ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల కుటుంబాలకు, గాయపడినవారికి రైల్వేశాఖ కూడా ఆర్థిక సాయం ప్రకటించింది. ఆ మేరకు మృతుల కుటుంబీకులకు తలా రూ.5లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.2.5లక్షలు, స్వల్పంగా గాయపడినవారికి రూ.50వేల చొప్పున ఆర్థికసాయం ప్రకటించింది.

ఇంటర్‌లాకింగ్ లేదా?

ప్రమాదస్థలంలో ఉన్న గేట్ కేబిన్‌లో ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. స్థానికులు గేట్ కీపర్ పంకజ్‌శర్మ రైలు వస్తుండటాన్ని గమనించకుండా నిద్రపోయాడనే ఆగ్రహంతో కేబిన్ అద్దాలను పగులగొట్టారు. ఇక గేట్ కేబిన్‌లో ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ ఉంటే గేటు తెరచి ఉన్నప్పుడు కిలోమీటర్ దూరానికి ముందే రెడ్‌సిగ్నల్ పడుతుంది. అయితే ప్రస్తుతం ప్రమాద స్థలంలో ఇంటర్‌లాకింగ్ సిస్టమ్ లేదని తెలుసుకుని రైల్వే ఉన్నతాధికారులు సైతం ఆశ్చర్యపోయారు. ఈ ప్రమాదం కారణంగా కడలూరు, చిదంబరం, మైలాడుదురై, తంజావూరు, విల్లుపురం, చెన్నైకి వెళ్లే పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

మంత్రి నివాళి...

ఈ ప్రమాదంలో మృతి చెందిన చారుమతి, చెళియన్, విమలేష్ అనే ముగ్గురు విద్యార్థుల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. ఆ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి సీవీ షణ్ముగం ఆ మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గేట్ కీపర్ అరెస్టు...

ఈ ప్రమాదానికి గేట్ కీపర్ నిర్లక్ష్యమే కారణమని, ఆ గేట్ వద్ద ఇంటర్‌లాకింగ్ సిస్టం లేనందువల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. గేటు యొద్దని బస్సు డ్రైవర్ కీపర్‌కు చెప్పి మరీ పట్టాలు దాటాడని మరికొంత మంది తెలిపారు. మొత్తమ్మీద కీపర్ గేటు వేయకపోవడమే ఈ ప్రమాదానికి కారణంగా భావించిన పోలీసులు.. కీపర్ పంకజ్‌శర్మ (32)ను అరెస్టు చేశారు. అంతేగాక అతడిని రైల్వేశాఖ సస్పెండ్ చేసింది..

రైల్వే శాఖ వివరణ...

ఈ ప్రమాదంపై దక్షిణ రైల్వే అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. గేట్ కీపర్ పంకజ్ శర్మ గేటును మూయడానికి సిద్ధమయ్యాడని, స్కూలు వ్యాన్ డ్రైవర్ గేటు వేయవద్దని కేకలు పెట్టాడని తెలిపారు. గేటు మూస్తున్న సమయంలోనే డ్రైవర్ వ్యాన్‌ను పట్టాలు దాటించేందుకు ప్రయత్నించాడని, ఈ కారణంగానే రైలు వ్యాన్‌ను ఢీకొందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంపై సమగ్రమైన విచారణకు ఆదేశించినట్లు కూడా తెలిపారు.

విద్యుత్ తీగె తగిలి ఒకరి మృతి...

ఈ ప్రమాదం కారణంగా రైలు మార్గంలో హైఓల్టేజీ విద్యుత్ వైరు పట్టాలపై తెగిపడింది. ఆ సమయంలో అటు వైపు వచ్చిన అన్నాదురై (52) అనే వ్యక్తి విద్యుత్ తీగెపై కాలుపెట్టడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే భద్రతా దళం పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

గేట్ మూయలేదు...

ప్రమాదం జరిగినప్పుడు రైల్వేగేట్ మూయలేదని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి విశ్వేష్ తెలిపాడు. రెడ్‌సిగ్నల్ కూడా లేదని, రైలు వస్తున్న శబ్దం కూడా వినిపించలేదని, వ్యాన్ పట్టాలను దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొన్నట్టు తెలిపాడు. ఇదే విధంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ శంకర్ కూడా ప్రమాదం జరిగినప్పుడు రైల్వే గేట్ మూసి లేదని తెలిపాడు.

తంజావూరు జిల్లాలో...

మినీ వ్యాన్, కారు ఢీ : నలుగురి మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా ఉత్తరమంగళం వద్ద మంగళవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తరమంగళం సమీపంలోని తంజావూరు, - విక్రవాండి జాతీయ రహదారిలో వరినారుతో వెళ్తున్న మినీ వ్యాన్‌ను చెన్నై నుంచి తంజావూరు వస్తున్న కారు అదుపు తప్పి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణించిన విజయ అనే మహిళ అక్కడికక్కడే మరణించింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరుగురిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా చెన్నైకి చెందిన కుమార్ (52), దుర్గ (32), నివేని సూర్యా (3) అనే ముగ్గురు మృతి చెందారు. తీవ్ర గాయాలతో మోనిషా, స్టాలిన్, విఘ్నేశ్ తంజావూరు వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.



మినీ వ్యాన్‌ను తొలగిస్తున్న పోలీసులు

రైలు ప్రమాదాలపై కేంద్ర ప్రభుత్వం చింతించడం లేదు

- డీఎంకే ఎంపీ కనిమొళి



ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాల గురించి కేంద్రప్రభుత్వం ఏ మాత్రం చింతించడంలేదని డీఎంకే ఎంపీ, పార్లమెంట్ కమిటీ ఛైర్మెన్ కనిమొళి ఆరోపించారు. కడలూరు సమీపంలో మంగళవారం ఉదయం రైల్వేగేటు దాటేందుకు యత్నించిన ప్రైవేటు పాఠశాల బస్సును పాసింజర్ రైలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన సంఘటనపై కనిమొళి మీడియాతో మాట్లాడారు. దేశంలో మొత్తం ఉన్న 65,584 కిలోమీటర్ల రైలు మార్గంలో కేవలం 1,548 కిలోమీటర్లకు మాత్రమే 'కవచ్' సిస్టమ్ ఉందని దీనిపై పలుమార్లు డీఎంకే తరుఫున పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రస్తావించినా కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సాంకేతిక పరిజ్ఞానం పరుగులు తీస్తున్న నేపథ్యంలో, ప్రయాణికులకు భద్రత పటిష్టం చేసేలా కేంద్ర తక్షణ చర్యలు చేపట్టాలని కనిమొళి డిమాండ్ చేశారు.

అధిష్ఠానం నిలిపే అభ్యర్థి

విజయం కోసం పాటుపడండి

- నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు స్టాలిన్ హితవు

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే తరఫున లేదా మిత్రపక్షాల తరఫున అధిష్ఠానం నిలబెట్టే అభ్యర్థుల విజయం కోసం పార్టీ శ్రేణులంతా సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జులకు హితవు పలికారు. తేనాంపేటలోని పార్టీ కార్యాలయం అన్నా అరివాలయంలో 'ఉడన్ పిరప్పే వా' పేరుతో ఈ నెల 13 నుంచి నియోజకవర్గాల ఇన్‌చార్జులతో ఆయన సమావేశమవుతున్నారు. ఇప్పటివరకూ పమత్తివేలూరు, పరమక్కుడి, శ్రీపెరుంబుదూరు, చెంగల్పట్టు, టి.నగర్, మైలాపూరు, కృష్ణగిరి సహా 25కు పైగా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో ఆయన భేటీ అయ్యారు. మంగళవారం విక్రవాండి, సెయ్యారు, సెంజి శాసనసభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, జిల్లా శాఖల నేతలతో ఆయన సమావేశమయ్యారు.ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ విక్రవాండి, సెంజి నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, స్థానిక నాయకుల విషయం, ఎన్నికల్లో పోటీకి ఆసక్తికనబరుస్తున్నవారి వివరాలను జిల్లా ఇన్‌ఛార్జుల ద్వారా తెలుసుకున్నారు. వచ్చే ఎనిమిది నెలలు అత్యంత కీలకమైనవని, ప్రతి కార్యకర్త పార్టీ గెలుపుకోసం పాటుపడ్డాలని, ఎన్నికల ప్రచారాన్ని కూడా తక్షణమే ప్రారంభించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు.



విక్రవాండి నియోజకవర్గ ఇన్‌చార్జితో మాట్లాడుతున్న స్టాలిన్

నేడు తిరువారూర్‌కు సీఎం

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్ జిల్లాలో ముఖ్యమంత్రి స్టాలిన్ రెండ్రోజులు పర్యటించి ప్రభుత్వ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు నగరం నుంచి విమానంలో తిరుచ్చి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో తిరువారూర్ చేరుకోనున్న స్టాలిన్ అక్కడ ప్రభుత్వ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 4 గంటలకు కాట్టూరు ప్రాంతానికి వెళ్లి ఆయన బామ్మ అంజుగం స్మారక మందిరంలో నివాళులర్పిస్తారు. అనంతరం తిరువారూర్ రైల్వేస్టేషన్ జంక్షన్‌లో దివంగత మాజీముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరించి స్టాలిన్ రోడ్ షోలో పాల్గొంటారు. రాత్రి తిరువారూర్‌లో బసచేసి 10వ తేదీ ఉదయం తిరువారూర్‌లో ఏర్పాటు చేసే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని కొత్త పథకాలను ప్రారంభిస్తారు. అక్కడే కొత్త పథకాలకు శంకుస్థాపన చేయనున్న సీఎం లబ్దిదారులకు ప్రభుత్వ సంక్షేమ సహాయాలు పంపిణీ చేస్తారు. ఈ మేరకు సచివాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

18న డీఎంకే ఎంపీల సమావేశం

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీల సమావేశంలో ఈ నెల 18న జరుగనుంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 21 నుంచి జరుగనున్న క్రమంలో, డీఎంకే ఎంపీల సమావేశం తేనాంపేటలోని అన్నా అరివాలయంలో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో జరుగనుందని పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ మంగళవారం విడుదల ఓ ప్రకటనలో తెలిపారు.

ఏడు ఖండాల్లో ఎత్తైన శిఖరాల అధిరోహణ



విమానాశ్రయంలో ముత్తమిళ్ సెల్విని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కరుణానిధి

- సాహసి ముత్తమిళ్ సెల్వి ఘనస్వాగతం

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి తమిళ మహిళగా పేరుగాంచిన ముత్తమిళ్‌సెల్వి, రెండేళ్లలో ఏడు ఖండాల్లోని ఎత్తైన శిఖరాలు అధిరోహించి మంగళవారం నగరానికి చేరుకున్నారు. స్థానిక తాంబరం సమీపం మన్నివాక్కంలో నివసిస్తున్న విరుదునగర్ జిల్లా జోగిల్‌పట్టికి చెందిన ముత్తమిళ్ సెల్వి (33) ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ, జపనీస్ భాష అనువాదకురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె ప్రపంచంలో ఏడు ఖండాల్లో ఉన్న ఎత్తైన శిఖరాలు అధిరోహించాలని నిర్ణయించుకున్నారు. ఆ ప్రకారం 2023 మార్చి 23న తన మొదటి ప్రయాణంగా ప్రపంచలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి తమిళ మహిళగా గుర్తింపు పొందింది. అనంతరం గత ఏడాది జూన్‌లో తన లక్ష్య సాధన కోసం ప్రయాణం సాగించిన ముత్తమిళ్ సెల్వి, ఈ ఏడాది జూన్ 16న ఉత్తర అమెరికాలోని శిఖరాన్ని అధిరోహించారు. లక్ష్యం సాధన పూర్తిచేసి నగరానికి తిరిగొచ్చిన ముత్తమిళ్ సెల్విని విమానాశ్రయంలో పల్లావరం ఎమ్మెల్యే కరుణానిధి సహా పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల హామీలపై అమలేదీ?

- డీఎంకేవన్నీ తప్పుడు హామీలే
- ఈపీఎస్ ధ్వజం
- కోవైలో వాకింగ్‌కు వెళ్ళి ఓటర్లతో మాటామంతి



కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను డీఎంకే ప్రభుత్వం పూర్తిగా నెరవేర్చలేదని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' (ప్రజలను కాపాడుదాం-రాష్ట్రాన్ని రక్షిద్దాం) అనే పేరిట తన ఎన్నికల ప్రచారాన్ని కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయంలో శ్రీకారం చుట్టిన ఈపీఎస్ రెండు నియోజకవర్గాల్లోని ప్రజలను పలుకరించారు. సాయంత్రం మూడు కిలోమీటర్ల మేర రోడ్‌షోలో పాల్గొని, రాత్రి కోవై రేస్‌కోర్సులో ఉన్న హోటల్‌లో బసచేశారు. ఆయన తన రెండోరోజు ప్రచారాన్ని మంగళవారం ఉదయం 6 గంటలకే ప్రారంభించారు. రేస్‌కోర్సు ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్ళి, అక్కడున్న వారిని పలకరించి అన్నాడీఎంకేకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. అనంతరం ఫుట్‌పాత్ వ్యాపారుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈపీఎస్‌తో పాటు మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి, ఎమ్మెల్యేలు అమ్మన్ అర్జున్, కేఆర్ జయరామ్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రాన్ని ఇప్పటివరకు కాంగ్రెస్ సహా పలు పార్టీలు పరిపాలించాయని, 73యేళ్ళ పాలనలో రాష్ట్రం చేసిన అప్పు రూ.5లక్షల 18వేల కోట్లని, అయితే 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే ఈ నాలుగేళ్ళలో చేసిన అప్పు రూ.4లక్షల 38వేల కోట్లు అని, ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ.లక్ష కోట్ల రుణం పొందేందుకు సీఎం స్టాలిన్ ప్రభుత్వం ప్రయత్నాల్లో ఉందని ఆరోపించారు. ఈ నాలుగేళ్ళ డీఎంకే పాలనలో ఎన్నికల హామీలు పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. మేట్టుపాళయం నుంచి ప్రారంభించిన తన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. కాగా, రెండో రోజు పర్యటనలో పలు కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమైన ఈపీఎస్ కోవై అన్నాడీఎంకే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలు పార్టీల నుంచి అన్నాడీఎంకేలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **పాడి:** అన్నై నగర్, సుబ్బులక్ష్మి నగర్, రాజీవ్ నగర్, బాలాజీ నగర్, వైగై నగర్.

తిరుమంగళం: మెట్రో జోన్, సత్యసాయి నగర్, పాడికుప్పం మెయిన్ రోడ్డు, టీఎన్‌హెచ్‌బీ క్వార్టర్స్, ఓల్డ్ బెన్, గోల్డన్ జూబ్లీ ఫ్లాట్స్, బాలాజి నగర్, కామరాజ్ నగర్, పెరియార్ నగర్, వీజీఎన్, అంబేద్కర్ నగర్, మెహతా రాయల్ పార్క్, రైల్ నగర్, శివన్ ఆలయ వీధి, శ్రీనివాసన్ నగర్, 100 అడుగుల రోడ్డు, న్యూకాలని, మేట్టుకుళం.

అరుంబాక్కం: వందడుగుల రోడ్డు, వీఎస్ పురం 1 నుంచి 3 వీధులు, త్రయంపు అపార్ట్‌మెంట్.

ఉప వైద్య కోర్సులకు 99,876 దరఖాస్తులు

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్, బీఫార్మ్ సహా 19 రకాల ఉప వైద్య కోర్సులకు 99,876 మంది దరఖాస్తు చేసినట్లు వైద్య విద్య డైరెక్టరేట్ తెలిపింది. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 2,500 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో ప్రభుత్వ కోటా కింద 15,000 సీట్లున్నాయి. ఈ కోర్సులకు ప్లస్ టూ మార్కుల ఆధారంగా అడ్మిషన్లు చేపడుతుంటారు. ఉప వైద్య కోర్సులకు 68,319 మంది, డిప్లొమో నర్సింగ్ కోర్సుకు 18,311 మంది, ఫార్మ్ డి (మూడేళ్లు) కోర్సుకు 198 మంది, ఆరేళ్ల కోర్సుకు 13,048 మంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు స్వీకరణ పెంపుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని వైద్య విద్య డైరెక్టరేట్ తెలిపింది.

గిరి ప్రదక్షిణకు అనుకూల సమయం

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ సమయాన్ని ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయానికి పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన భక్తులు వస్తుంటారు. పౌర్ణమి ఘడియల్లో అరుణాచలేశ్వర ఆలయ వెనుక వైపున్న అన్నామలై పర్వతం చుట్టూ 14 కి.మీ మేర గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. ఈ క్రమంలో, ఆణి నెల పౌర్ణమి ఈ నెల 10వ తేది వేకువజామున 2.33 గంటలకు ప్రారంభమై 11వ తేది వేకువజామున 3.08 గంటల వరకు ఉంటుందని, ఈ సమయం గిరి ప్రదక్షిణకు అనుకూలమని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ప్రజారోగ్యశాఖలో ఆరోగ్య సంఘం ద్వారా పోస్టుల భర్తీ

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితర పోస్టులను జిల్లా ఆర్యోగ సంఘం ద్వారా భర్తీ చేయనున్నారు. ఇప్పటివరకు ఈ పోస్టులను వైద్య ఉద్యోగుల ఎంపిక కమిషన్ (ఎంఆర్బీ) చేపట్టేది. ప్రస్తుతం నియామకాల్లో మార్పులు చేసి జిల్లా ఆరోగ్యం సంఘాల ద్వారా 2,500 నర్సులు, 1,500 ఫార్మాసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్‌లను నియమించనున్నారు. 11 నెలల ఒప్పంద ప్రాతిపదికన ఈ నియామకాలు చేపట్టాలని జాతీయ ఆరోగ్య సంరక్షణ పథక సంచాలకులు డా.అరుణ్ తంబురాజ్ అన్ని ఆరోగ్య శాఖ అధికారులు, వైద్యకళాశాల పిన్సిపాల్స్‌కు సర్క్యులర్ జారీచేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకం

● మంత్రి కోవి చెళియన్

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో 800 మంది గౌరవ లెక్చరర్లను నియమించనున్నట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... పలు కేసుల కారణంగా కళాశాలల్లో శాశ్వత అధ్యాపకుల నియామకంలో జాప్యం జరుగుతుందన్నారు. దీంతో, బోధనలో ఇబ్బంది కలుగకుండా ఖాళీ అధ్యాపకుల పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించనున్నామని తెలిపారు. ఉన్నత విద్యాశాఖ కింద పనిచేస్తున్న 58 ప్రభుత్వ కళాశాలల్లో 46 కళాశాలలకు శాశ్వత ప్రిన్సిపాల్స్ పనిచేస్తున్నారని, మిగిలిన 12 పోస్టులను పదోన్నతులతో భర్తీ చేసే చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

తగ్గిన విమాన ప్రయాణికుల సంఖ్య

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మీనంబాక్కంలోని విమానాశ్రయం నుంచి వెళ్లే ప్రయాణికుల సంఖ్య తగ్గింది. గత జూన్ నెలలో ఈ విమానాశ్రయం నుంచి 12,958 విమాన సర్వీసులు నడపగా, 19,38,194 మంది ప్రయాణించారు. ఆ ప్రకారం, గత మే నెలతో పోల్చితే జూన్‌లో ప్రయాణికుల సంఖ్య 1,19,654కు తగ్గింది. అదే సమయంలో, జూన్‌లో అనివార్య, నిర్వహణ, తగిన సంఖ్యలో ప్రయాణికులు లేకపోవడం తదితర కారణాలతో 491 విమానాలు రద్దయ్యాయి.

ప్రభుత్వాస్పత్రిలో ఆవిన్ పార్లర్

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కం మండలం 151వ వార్డు చిన్న పోరూర్‌లో అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉంది. రోగులు, వారి సహాయకులు సౌకర్యార్థం ఆసుపత్రి ప్రాంగణంలో ఆవిన్ పార్లర్ ఏర్పాటుచేశారు. పాలు, పాలకోవా, నెయ్యి, పాల పౌడర్, పాల ఉత్పత్తులు ఈ పార్లర్‌లో విక్రయించనున్నట్లు ఆవిన్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆన్‌లైన్‌లో జపాన్ భాషపై శిక్షణ

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భారత్-జపాన్ వృత్తి, వ్యాపార సభ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా జపాన్ భాషపై శిక్షణ తరగతులు ఇవ్వనున్నారు. ఈ విషయమై వర్తక సభ ప్రధాన కార్యదర్శి సుగుణ రామూర్తి విడుదల చేసిన ప్రకటనలో... భారత్-జపాన్ వృత్తి, వర్తక సభ ఆధ్వర్యంలో జపాన్ భాష రాయడం, మాట్లాడం తదితరాలపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ నెల మూడో వారం నుంచి ప్రారంభమయ్యే శిక్షణా తరగతులు డిసెంబరు వరకు ఆరు నెలలు ప్రతివారం శని, ఆదివారాల్లో నిర్వహించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు 9884394717, 9884200505 అనే నెంబరు, www.ijcci.com అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

ప్రత్యేక అధికారుల పదవీ కాలం పొడిగింపు

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు నియమించిన ప్రత్యేక అధికారుల పదవీకాలం 2026 జనవరి 5వ తేది వరకు పొడిగించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లోని 9,581 గ్రామ పంచాయతీలు, 314 పంచాయతీ యూనియన్లు, 28 జిల్లా పంచాయతీలకు ఎంపికైన పాలకమండళ్ల పదవీకాలం గత జనవరి 5వ తేదీతో ముగిసింది. ఈ స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణ వివిధ కారణాలతో ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ప్రత్యేక అధికారులను నియమిస్తూ గత శాసనసభ సమావేశాల్లో నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రత్యేక అధికారులు పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో, మరో ఆరు నెలలు పొడిగిస్తూ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి గగన్‌దీప్ సింగ్ బేదీ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వాస్పత్రి వైద్యుడిపై దాడి

● శ్రీవిల్లిపుత్తూరులో వైద్యుల నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యులు

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యుడు కత్తిపోట్లకు గురవడాన్ని ఖండిస్తూ ప్రభుత్వ వైద్యులు మంగళవారం విధులు బహిష్కరించి ధర్నా చేపట్టారు. శ్రీవిల్లిపుత్తూరు పెరుమాళ్‌పట్టి ప్రాంతానికి చెందిన రమేష్‌బాబు ప్రభుత్వాసుపత్రిలో ఈఎన్‌టీ ప్రత్యేక వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఆయన చిన్నకడ బజారువీధిలోవున్న తన క్లీనిక్‌కు సోమవారం రాత్రి 9.30 గంటలకు తాళం వేస్తున్న సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆయనపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. శరీరంపై 6 ప్రాంతాల్లో గాయాలు కావడంతో రమేష్‌బాబును ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆవారంపట్టికి చెందిన పాండి గణేష్ (38) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ వైద్యుడిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేష్, తమిళనాడు ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు వంద మందికి పైగా వైద్యులు విధులను బహిష్కరించి మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. విధి నిర్వహణలో ఉన్న వైద్యులకు భద్రత కల్పించాలని, దాడికి పాల్పడే వ్యక్తులను గూండా చట్టం కింద అరెస్టు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు యథావిధిగా బస్సులు

● మంత్రి శివశంకర్

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం కార్మిక సంఘాలు బంద్ చేపట్టనున్న నేపథ్యంలో, ప్రభుత్వ బస్సులు యధావిధిగా నడుస్తాయని రవాణాశాఖ మంత్రి శివశంకర్ పేర్కొన్నారు. భారత్ బంద్‌కు అధికార డీఎంకే, కార్మిక సంఘాలు, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, ఎండీఎంకే, డీపీఐ తదితర రాజకీయ పార్టీలకు చెందిన 13 కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో, బంద్ రోజు యథావిధిగా బస్సులు నడపాలని రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థకు ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రాష్ట్రవ్యాప్తంగా బస్సుల సేవలను అందుబాటులో ఉంటాయని మంత్రి హామీ ఇచ్చారు.

వేతనం కట్... : ఇదిలా వుండగా, బుధవారం బంద్ సందర్భంగా విధులను బహిష్కరించి ఆందోళనలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పాఠశాలల టీచర్లు, సిబ్బందిపై కార్మిక చట్టం కింద చర్యలుంటాయని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో భారత్ బంద్‌లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, 'నో వర్క్, నో పే' విధానంలో వేతనం కట్ చేయనున్నట్లు సీఎస్ హెచ్చరికలు జారీచేశారు.

14న జీసీసీకి వ్యతిరేకంగా అన్నాడీఎంకే మానవహారం

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో జాతీయ నగర పునరాభివృద్ధి పథకం పనులను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 14న అన్నాడీఎంకే ఆధ్వర్యంలో మానవహారం చేపట్టనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తెలిపారు. స్థానిక తండయార్‌పేట జోన్ పరిధిలో జాతీయ నగర పునరాభివృద్ధి పథకం కింద సుమారు 2వేల మందికి పైగా పారిశుధ్య కార్మికులు కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్నారు. ఈ పనులను రాష్ట్రప్రభుత్వ ఆదేశాలతో కార్పొరేట్ సంస్థకు అప్పగించేందుకు జీసీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందువల్ల 2007వ సంవత్సరం నుంచి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశముందని, ఆ కార్మికుల తరుపున పలు రాజకీయ పార్టీలలోని కార్మిక సంఘాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో, పారిశుధ్య కార్మికుల కోరిక మేరకు 14న తేదీ సాయంత్రం 4 గంటలకు తండయార్‌పేటలో నిర్వహించనున్న ఆందోళనలో అన్నాడీఎంకే నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని ఈపీఎస్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.


5న టాస్మాక్ ఉద్యోగుల నిరాహారదీక్ష

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణలో టాస్మాక్ ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కారానికి ఆగస్టు 5న నగరంలో నిరాహారదీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు టాస్మాక్ ఉద్యోగుల రాష్ట్ర సమ్మేళన సమావేశం నగరంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశం ఆమోదించిన తీర్మానాలను సమ్మేళనం అధ్యక్షుడు మురుగన్ మీడియాకు వివరించారు. టాస్మాక్ ఉద్యోగులకు రూ.26వేలు జీతం ఇవ్వాలని, కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి, ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున వేతనం పెంచివ్వాలని డిమాండ్ చేశారు.

చేపాక్కం స్టేడియంలో డిసెంబరు వరకు మ్యాచ్‌ల రద్దు

పెరంబూర్,జూలై8(ఆంధ్రజ్యోతి):స్థానిక చేపాక్కం ఎంఏ చిదంబరం క్రికెట్ స్టేడియంలో మరమ్మతుల కారణంగా డిసెంబరు వరకు పోటీలను రద్దు చేశారు. క్రికెట్ పోటీలకు ఆతిథ్యమిచ్చే చేపాక్కం స్టేడియంలో ప్రస్తుతం గడ్డి మార్పే పనులు జరుగుతున్నందున, ఈ ఏడాది మొత్తం మ్యాచ్‌లు రద్దు చేశారు. ఈ విషయమై చేపాక్కం స్టేడియం అధికారులు మాట్లాడుతూ... క్రికెట్ ఆడేందుకు మైదానం చాలా ముఖ్యమైనదని,ఇప్పటికే నేలదాని మృదుత్వం కోల్పోయిందన్నారు. అలాగే, దానిపై గడ్డి పెరగడం కూడా సమస్యగా మారిందని తెలిపారు. ఈ కారణంగా మైదానంలోని మట్టి పూర్తిగా తొలగించి, కొత్త ఎర్రమట్టి, బంక మట్టి అవసరమైన ఇసుకతో కలిపి చదును చేసి, గడ్డి పెంచాల్సి ఉందన్నారు. ఈ పనులు డిసెంబరు వరకు జరిగే అవకాశముందని, అందువల్ల ఈ ఏడాదిలో చిదంబరం స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు ఉండవని వారు పేర్కొన్నారు.

ఆస్పత్రిలో వసతులు లేవంటూ అన్నాడీఎంకే ఆందోళన



వేలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల ప్రారంభించిన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో తగిన పరికరాలు లేవని ఆరోపిస్తూ మంగళవారం ధర్నా చేపట్టనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. కానీ, ఈ ఆందోళనలకు పోలీసులు అనుమతివ్వలేదు. అయితే అన్నాడీఎంకే జిల్లా సెక్రటరీ అప్పు, మాజీ మంత్రి ముక్కూరు సుబ్రమణ్యం నేతృత్వంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు ఆందోళన చేపట్టేందుకు వచ్చారు. వారిని అడ్డుకున్న పోలీసులు వాహనాల్లో సమీపంలోని కల్యాణ మండపానికి తరలించారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట బీజేపీ నేతల ధర్నా


నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

వేలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ వేలూరు కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఇందులో వేలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు దశరథన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ నిరసనలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాత్యాయణి, ఉపాధ్యక్షుడు నరేంద్రన్ పాల్గొని డీఎంకే ప్రభుత్వం రైతుల కష్టాలను పట్టించుకోవడంలేదని, డీఎంకే అధికారంలోవున్న ఈ నాలుగేళ్లలో ఏనాడు మామిడి రైతుల కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టలేదని ఆరోపించారు. మామిడి దిగుబడి ఎక్కువగా వుండే కృష్ణగిరి, తేని, తిరువళ్లూరు జిల్లాల్లోని రైతులు నష్టపోకుండా రూ.15 కనీస మద్దతు ధర నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చడం ఏ పార్టీకి సాధ్యం కాదు

డీపీఐ ఎంపీ తిరుమావళవన్



ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ప్రజలకిచ్చే హామీలన్నీ అధికారంలోకి వచ్చే ఏ పార్టీ కూడా శత శాతం నెరవేర్చిన దాఖలాలులేవని దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా (డీపీఐ) నేత, ఎంపీ తిరుమావళవన్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికలకు 10 నెలలే సమయం ఉన్నందున రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయని, తమ పార్టీ తరఫున కూడా జిల్లా స్థాయిలో శ్రద్ధ చూపించేలా కార్యకర్తలకు సూచించినట్లు తెలిపారు. అధికార డీఎంకే కూటమిలో సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే, మనిదనేయ మక్కల్ కట్చి, ఏయూఎంఎల్, ఎంఎన్ఎం తదితర పార్టీలు సఖ్యతగా ఉన్నాయన్నారు. వంద శాతం ఎన్నికల హామీలు నెరవేర్చడం అధికారంలోకి వచ్చే ఏ పార్టీకి సాధ్యంకాదని, అయినప్పటికీ ప్రజలకు లబ్ధికలిగించే ముఖ్యమైన హామీలను వచ్చే ఎన్నికల్లోగా నెరవేర్చాలంటూ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు డీఎంఐ తరుపున విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఆలయ ట్రస్టీలు


బాధ్యతలు స్వీకరిస్తున్న ట్రస్టీలు, సభ్యులతో మంత్రి దురైమురుగన్

వేలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొసపేటలో ఉన్న ఆనైకులత్తమ్మన్ ఆలయ ట్రస్టీ బాధ్యతల స్వీకరణ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి మాజీ ట్రస్టీ అశోకన్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు, డీఎంకే సీనియర్ నేత దొరైసింగా, వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, అప్పాజీ స్వామి, చెంగానత్తం సచ్చిదానంద స్వామి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆనైకులత్తమ్మన్ ఆలయ ట్రస్టీ అధ్యక్షులుగా శివకుమార్, సభ్యులు పదవీప్రమాణం చేశారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సత్కారం


రిటైర్డ్ టీచర్లను సత్కరిస్తున్న నిర్వాహకులు

వేలూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల సత్కారం మంగళవారం జరిగింది. జవహర్ మెట్రిక్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంఘం అధ్యక్షుడు జనార్ధనన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ జాతీయ మహాసభల కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘ నిర్వాహకులు మదిఅయగన్, కొలంజినాథన్, పాండ్యన్, ముత్తుకుమరన్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మే నెలలో పదవీ విరమణ పొందిన టెక్నికల్ విద్య ఉపాధ్యాయులు రవి, ఉదయకుమార్, వైర ఉమాపతి, పద్మిని, సీతారామన్, మల్లిక, బన్నారి, దేవనాధన్, రవిచంద్రన్‌లను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. మోహన్‌కుమార్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఏర్కాడు ఎక్స్‌ప్రెస్‌కు బెదిరింపు

● యువకుడి అరెస్టు


అరెస్టయిన శబరీశన్

చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏర్కాడు ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేస్తానంటూ బెదిరించిన యువకుడిని ఆ రైలులోనే కాట్పాడి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. ఈరోడ్ రైల్వేస్టేషన్ నుంచి చెన్నై సెంట్రల్‌కు ఏర్కాడు ఎక్స్‌ప్రెస్ వెళ్తుండగా మొరాపూరు స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి 100, 108 అత్యవసర సర్వీసు ఫోన్ నెంబర్లకు కాల్ చేసి ఏర్కాడు ఎక్స్‌ప్రెస్ రైలు దారి మళ్లించి హైజాక్ చేయబోతున్నట్లు బెదరించి కాల్ కట్‌చేశాడు. దీంతో చెన్నైలోని పోలీసు కంట్రోల్ రూమ్ అధికారులు మొరాపూరు రైల్వే పోలీసులను అప్రమత్తం చేశారు. సైబర్ క్రైం పోలీసుల సహకారంతో రైలును హైజాక్ చేస్తానంటు బెదరించిన వ్యక్తి ఆచూకీ కనుగొనేందుకు ప్రయత్నించారు. కంట్రోల్‌రూంలో నమోదైన మొబైల్ నెంబర్ ఆధారంగా బెదిరించిన వ్యక్తి ఏర్కాడు ఎక్స్‌ప్రెస్‌లోనే అన్ రిజర్వుడు బోగీలో ప్రయాణిస్తున్నాడని గుర్తించి, జోలార్‌పేట, కాట్పాడి రైల్వేస్టేషన్ల అధికారులకు సమాచారం అందించారు. కాట్పాడి రైల్వేస్టేషన్‌లో ఆ రైలు ఆగగానే అన్‌రిజర్వుడు బోగీలోకి రైల్వేపోలీసులు వెళ్లి ధర్మపురికి చెందిన శబరీశన్ (25) అనే యువకుడిని అరెస్టు చేశారు. నిరుద్యోగి అయిన ఆ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆ రైలును హైజాక్ చేసుకెళతానని బెదరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

అన్బుమణికి వ్యతిరేకంగా పీఎంకే వర్కింగ్ కమిటీ తీర్మానం

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దిండివనం సమీపం ఓమందూరులో మంగళవారం జరిగిన పీఎంకే వర్కింగ్ కమిటీ సమావేశంలో, బహిరంగ ప్రదేశాల్లో రాందాస్ మాటలకు పార్టీ వర్కింగ్ లీడర్ అన్బుమణి కట్టుబడి ఉండకపోవడాన్ని ఖండిస్తూ తీర్మానం ఆమోదించారు. పీఎంకేలో తండ్రి-కుమారుడి మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకుని రెండు గ్రూపులుగా తమ తమ మద్దతుదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అన్బుమణికి మద్దతుదారులైన జిల్లా కార్యదర్శులను తొలగించి, తన మద్దతుదారులను రాందాస్ జిల్లా కార్యదర్శులుగా నియమిస్తున్నారు.. పీఎంకేలో నిర్వాహక కమిటీ, కార్యనిర్వాహక కమిటీ, సర్వసభ్య కమిటీ అని మూడు విభాగాలున్నాయి. అన్బుమణి నేతృత్వంలోని పార్టీ కార్యనిర్వాహక కమిటీని రద్దు చేసి, 21 మందితో కొత్త కమిటీని రాందాస్ ప్రకటించారు. కమిటీలో అన్బుమణి, ఆయన మద్దతుదారులైన ప్రధాన కార్యదర్శి వడివేలు రాఘవనన్, కోశాధికారి తిలకభామకు చోటు కల్పించలేదు. ఈ నేపథ్యంలో, పీఎంకే కొత్త కార్యనిర్వాహక కమిటీ సమావేశం ఓమందూరులో జరిగింది. ఈ సమావేశంలో, అన్బుమణి తీరును ఖండిస్తూ తీర్మానం సహా కూటమిపై నిర్ణయం తీసుకునే అధికారం రాందాస్ అందజేయడం, తన చర్యలకు అన్బుమణి క్షమాపణ చెప్పాలి సహా పలు తీర్మానాలు చేసినట్లు రాందాస్ మద్దతుదారులు తెలిపారు.

● వాచ్‌మన్ మృతి వ్యవహారం...

హైకోర్టులో నివేదిక అందజేసిన న్యాయమూర్తి

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుభువనం ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ మృతి కేసు వ్యవహారానికి సంబంధించి మదురై జిల్లా న్యాయమూర్తి హైకోర్టు మదురై బెంచ్‌లో విచారణ నివేదిక దాఖలుచేశారు. శివగంగ జిల్లా మడప్పురం భద్రకాళి అమ్మవారి ఆలయ వాచ్‌మన్ అజిత్ కుమార్, నగలు చోరీచేశారనే కేసులో పోలీసులు విచారణకు వెళ్లి అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన హైకోర్టు మదురై బెంచ్, మదురై జిల్లా న్యాయమూర్తి జాన్ సుందర్‌లాల్ సురేష్ దీనిపై విచారణ జరిపి, ఈ నెల 8వ తేది నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీచేసింది. న్యాయమూర్తి జాన్ సుందర్‌లాల్ సురేష్ మృతుడి కుటుంబసభ్యులు, బంధువు, స్నేహితులను నాలుగు రోజులు విచారించారు. ఈ కేసు మంగళవారం హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణియం, మరియక్లేట్‌లతో కూడిన ధర్మాసనం విచారించగా, న్యాయమూర్తి జాన్ సుందర్‌లాల్ సురేష్ తరఫున విచారణ నివేదిక దాఖలుచేశారు. కాగా, అజిత్ కుమార్ కేసులో మధ్యంతర పరిహారం అందించడంపై రెండు వారాలు అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ధర్మాసనానికి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ విజ్ఞప్తి పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదావేస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

వివాహితపై అత్యాచారయత్నం

● మతబోధకుడి అరెస్టు

టినగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా మెక్కామండపం సమీపం ఓ ప్రాంతంలో వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన క్రైస్తవ మతబోధకుడిని పోలీసులు అరెస్టు చేశారు. బాధిత యువతికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం లేని ఆ మహిళ ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఆ యువతిని తీసుకుని ఆమె తల్లి మెక్కామండపం పాండివిళై ప్రాంతంలోని క్రైస్తవ సభకు వెళ్లింది. అక్కడి మతబోధకుడు రెజిమోన్ (43) రోగం నయం కావాలంటే ఆమె ఒంటరిగా తనతోపాటు ప్రార్థన చేయాలని తెలిపారు. ఆ మేరకు ఓ గదిలోకి వివాహితను తీసుకెళ్ళి ధ్యానం పేరుతో అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. దిగ్భ్రాంతి చెందిన ఆ మహిళ బయటకు వచ్చి తల్లికి, బంధువులకు విషయం తెలిపింది. వెంటనే ఆ మహిళ బంధువులు తక్కలై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని మతబోధకుడు రెజిమోన్‌ను అరెస్టు చేశారు.

తల్లి పాలు తాగుతూ పసికందు మృతి

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జన్మించి ఏడు రోజులే అయిన ఆడ శిశువు తల్లి పాలు తాగే సమయంలో ఊపిరాడక మృతిచెందిన ఘటన తిరువారూర్ జిల్లాలో చోటుచేసుకుంది. కొల్లుమాంగడి ప్రాంతానికి చెందిన సుకుమారన్ భార్య ఫాతిమా మేరి గత నెల 30వ తేది ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఇంటికి చేరుకున్న ఆమె, ఆదివారం రాత్రి పసికందుకు పాలు పడుతోంది. కొద్దిసేపటి తర్వాత పసికందు అచేతనంగా పడిపోవడం, ఒళ్లంతా చల్లబడడంతో దిగ్భ్రాంతి చెందిన ఫాతిమా మేరి, శిశువును నన్నిలం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే శిశువు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పేరలం పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు. కాగా, పసికందుకు పాలిచ్చే సమయంలో తల్లులు తగిన విధంగా కూర్చోవాలని, పాలు తాగే సమయంలో బిడ్డను గమనించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నటులు శ్రీకాంత్, కృష్ణకు నిబంధనలతో బెయిలు మంజూరు

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల కేసులో నటులు శ్రీకాంత్, కృష్ణలకు నిబంధనలతో కూడిన బెయిలు మంజూరైంది. మాదకద్రవ్యాల వినియోగం కేసులో అరెస్టయి జైలులో ఉన్న శ్రీకాంత్, కృష్ణ తమకు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్లు సోమవారం న్యాయమూర్తి నిర్మల్‌కుమార్ విచారించారు. ఈ కేసులో మొదటి నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా నటుడు శ్రీకాంత్‌ను అరెస్ట్ చేశారని, అరెస్ట్ చేసిన సమయంలో శ్రీకాంత్ వద్ద ఎలాంటి మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకోలేదని శ్రీకాంత్ తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. కృష్ణకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో మాదకద్రవ్యాలు వినియోగించినట్లు నిరూపణ కాలేదని కృష్ణ తరపు న్యాయవాది. వివరించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ చేసిన నిందితుల వాంగ్మూలం ఆధారంగా శ్రీకాంత్, కృష్ణలను అరెస్ట్ చేసినట్లు, వారికి బెయిలు మంజూరు చేయరాదని పోలీసుల తరపు న్యాయవాది కోరారు. వాదనల అనంతరం శ్రీకాంత్, కృష్ణ బెయిలుపై తీర్పును న్యాయమూర్తి, మంగళవారానికి వాయిదావేశారు. ఆ ప్రకారం, మంగళవారం న్యాయమూర్తి... వారికి బెయిలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రూ.10 వేల సొంత పూచీకత్తు, అదే మొత్తంలో ఇద్దరు పూచీకత్తు సమర్పించాలని, తదుపరి ఆదేశాలు వచ్చే వరకు దర్యాప్తు అధికారి ముందు హాజరై సంతకం చేయాలని న్యాయమూర్తి నిబంధనలు విధించారు.

రౌడీ మాడు దినేష్ అరెస్టు

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గంధపు చెక్కల స్మగ్లింగ్, హత్య తదితర 33 కేసుల్లో సంబంధాలున్న రౌడీ మాడు దినేష్ (39)ను గ్రేటర్ చెన్నై పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నగర పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశాలతో చర్యలు చేపట్టిన ప్రత్యేక విభాగం పోలీసులు నగరంలోని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైన రౌడీల వివరాలు సేకరించి, వాటి ఆధారంగా గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు 80శాతం మంది రౌడీలను అరెస్టు చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు. ఆ రీతిలో ఏప్లస్ కేటగిరికి చెందిన రౌడీలు పలువురు పోలీసుల చర్యలకు భయపడి పొరుగురాష్ట్రాలకు పరారయ్యారు. వారిని కూడా ఆయా రాష్ట్రాల పోలీసుల సహకారంతో అరెస్టు చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో, స్థానిక చూలైమేడు ప్రాంతానికి చెందిన మాడు దినేష్ అనే ఏప్లస్ కేటగిరి రౌడీపై మొత్తం 33 కేసులున్నాయి. అతడు 2010 నుంచి అజ్ఞాతంలోకి జారుకున్న నేపథ్యంలో, ఇటీవల వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని ఓ గ్రామంలో తలదాచుకున్నట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో సోమవారం రాత్రి అక్కడికే వెళ్ళి దినేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు రాత్రికి రాత్రే నగరానికి తరలించి విచారణ చేపట్టారు.

బిర్యానీ హోటల్ సిబ్బందిపై దాడి

● వ్యాసర్పాడిలో రౌడీ అరెస్టు

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసర్పాడి మార్కెట్ ప్రాంతంలో మామూళ్లు ఇవ్వలేదని బిర్యాని హోటల్ సిబ్బందిపై దాడికి పాల్పడిన గౌతమ్ (33) అనే రౌడీని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మహ్మద్ సుహైల్ నడుపుతున్న బిర్యాని హోటల్‌లో అజీజ్ రెహ్మాన్ (61) పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బిర్యాని హోటల్‌కు వెళ్ళి తమకు మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో రూ.200 ఇచ్చి పంపించారు. మళ్ళీ గంట తర్వాత వెళ్ళిన ఆ వ్యక్తులు మామూళ్లు డిమాండ్ చేయడంతో అభ్యంతరం తెలపడంతో మహమ్మద్ సుహైల్, అజీజ్ రెహ్మాన్‌లను కత్తితో గాయపరిచి అక్కడినుంచి పరారయ్యారు. దీనిపై అందజేసిన ఫిర్యాదుమేరకు రంగంలోకి దిగిన పోలీసులు గాయపడిన వారిని ప్రభుత్వ స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి వ్యాసర్పాడికి చెందిన గౌతమ్ (33)ను అరెస్టు చేసి, పరారైన ప్రకాష్ అనే వ్యక్తి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

పోలీసుల విచారణకు భయపడి అజ్ఞాతంలోకి నిఖిత



చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభవనం ఆలయ వాచ్‌మన్ అజిత్‌కుమార్ లాకప్‌డెత్‌కు కారకురాలైన ప్రొఫెసర్ నిఖిత పోలీసుల విచారణకు భయపడి 17 రోజులు కళాశాలకు సెలవు పెట్టి అజ్ఞాతంలోకి వెళ్ళింది. నిఖిత (46) దిండుగల్‌లోని ఎంవీఎం ప్రభుత్వ మహిళా ఆర్ట్స్ కళాశాలలో బాటనీ విభాగంలో పనిచేస్తోంది. తన కారులో నగలను అజిత్‌కుమార్ అపహరించాడని ఫిర్యాదు చేయడం, ఆ నేపథ్యంలో అతడిని పోలీసులు కస్టడీలోకి తీసుకోగా, లాకప్‌లో మరణించిన విషయం తెలిసింది. ప్రస్తుతం వాచ్‌మన్ లాకప్‌డెత్‌పై సీబీఐ విచారణ జరుగనుంది. అదే సమయంలో హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌ఆదేశం ప్రకారం మదురై జడ్జి తన నివేదికను మంగళవారం సమర్పించారు. ఆ నివేదిక ప్రకారం పోలీసులు తన వద్దకు విచారణ కోసం వస్తారని భావించిన నిఖిత 17 రోజులు మెడికల్ లీవు పెట్టి అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారని కళాశాల నిర్వాహకులు చెబుతున్నారు.

చిత్రజ్యోతి

కేజేఆర్ హీరోగా కొత్త చిత్రం



చిత్ర పూజా కార్యక్రమంలో నయినార్ నాగేంద్రన్, ప్రభుదేవా, కేజేఆర్ తదితరులు

'అంగీకారం' చిత్రం ద్వారా వెండితెరకు హీరోగా పరిచయమైన కేజేఆర్.. హీరోగా మరో చిత్రం తెరకెక్కనుంది. 'మార్క్ ఆంటోనీ' మూవీ నిర్మించిన మినీ స్టూడియోస్ పతాకంపై 'ప్రొడక్షన్ నెం.15' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందనుంది. ఈ కొత్త చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం ఇటీవల నగరంలో జరిగింది 'విలంగు' అనే వెబ్ సిరీస్ రూపొందించిన ప్రశాంత్ పాండిరాజ్ వద్ద కో-డైరెక్టరుగా పనిచేసిన రీగన్ స్టానిస్‌లాస్ ఈ చితరం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రంలో కేజేఆర్, అర్జున్ అశోకన్, శ్రీదేవి, సింగం పులి, జయప్రకాష్, హరీష్ కుమార్, అభిషేక్ జోసెఫ్ జార్జ్, అజు వర్గీస్, శ్రీకాంత్ మురళి తదితరులు నటిస్తున్నారు. మినీ స్టూడియోస్ పతాకంపై ఎస్.వినోద్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, పూజా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, దర్శక నటుడు ప్రభుదేవా తదితర సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.



అమ్మగా నటించడం గర్వంగా వుంది

● ఐశ్వర్య రాజేష్

సినిమాల్లో అమ్మ పాత్రల్లో నటించడం గర్వించదగిన విషయమని హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ అన్నారు. తమిళం, తెలుగు భాషా చిత్రాల్లో నటిస్తూ ఎంతో బిజీగా ఉన్న ఐశ్వర్య.. తెలుగులో సూపర్ హిట్ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నలుగురు బిడ్డలకు తల్లిగా నటించారు. దీనిపై ఆమె స్పందిస్తూ, 'సినిమాల్లో చిన్నపిల్లలకు తల్లిగా నటించడం నాకు ఎంతో ఇష్టం. దీనిని గర్వంగా భావిస్తున్నాను. నా సినీ కెరీర్‌లో యుక్త వయసులో ఎక్కువగా అమ్మ పాత్రల్లో నటించాను. నటిగా ఉన్నపుడు అన్ని రకాల పాత్రలు చేయాలి. అలా నటించేటపుడు వయసు ఒక అడ్డంకిగా మారకూడదు. 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలో నలుగురు పిల్లలకు తల్లిగా నటించాను. ఈ సినిమా రెండో భాగమంటూ వస్తే అందులో ఇద్దరు పిల్లల తల్లిగా నటించేందుకు ఏమాత్రం వెనుకంజవేయను. ఇదే విషయాన్ని ఆ చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి కూడా చెప్పారు' అని పేర్కొన్నారు.

18న విడుదల కానున్న 'జన్మ నచ్చత్తిరం'


'జన్మ నట్చత్తిరం'లో తమన్ అక్షన్

హారర్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కిన 'జన్మ నచ్చత్తిరం' ఈ నెల 18న విడుదలకానుంది.2024లో వచ్చిన 'ఒరు నొడి' మూవీ థియేటర్లలో పెద్దగా ప్రదర్శనకు నోచుకోకపోయినప్పటికీ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో మాత్రం ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఆదర్శంగా తీసుకుని ఇపుడు 'జన్మ నచ్చత్తిరం' అనే పేరుతో మరో చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు మంచి స్పందన వచ్చింది. విడుదల తేదీ సమీపిస్తుండటంతో త్వరలోనే చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ట్రైలర్, ఆడియో రిలీజ్ చేయనున్నారు. ఇందులో తమన్ అక్షన్, మాల్వి మల్హోత్రా, మైత్రేయ, రక్షా షెరీన్, శివం, అరుణ్ గాంధీ, కాళి వెంకట్, మునీష్కాంత్, వేలా రామమూర్తి తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు.

నాలుగో సారి ఎస్‌జే సూర్యతో రెహ్మాన్



గత కొంతకాలంగా అద్భుత నటనతో రాణిస్తున్న సినీ దర్శకుడు ఎస్‌జే సూర్య తాజాగా దర్శకత్వం వహించే చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహ్మాన్ సంగీతం సమకూర్చనున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. 'కిల్లర్' అనే టైటిల్ ఖరారు చేయగా, ఈ సినిమాకు ఎస్‌జే సూర్య దర్శకత్వం వహించడంతో పాటు హీరోగా నటిస్తున్నారు. ఎస్‌జే సూర్య - ఏఆర్ రెహ్మాన్‌ల కాంబినేషన్ నాలుగోసారి రిపీట్ కానుంది. గతంలో వీరిద్దరి కాంబోలో 'న్యూ', 'కొమరం పులి', 'అన్బే ఆరుయిరే' వంటి చిత్రాలు వచ్చాయి. ఇపుడు మరోమారు ప్రేక్షకులను అలరించేందుకు చేతులు కలిపారు. తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో 'కిల్లర్' మూవీని రూపొందించనున్నారు.

వైభవంగా నెల్లయప్పర్ మహారథోత్సవం

టి.నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరం మధ్యలో నెల్లయప్పర్ - కాంతిమది అమ్మవారి ఆలయంలో ఆణి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం మహా రథోత్సవం వైభవంగా జరిగింది. వివిధ దేవతామూర్తులతో ఐదు రథాలు ఒకే సారి ప్రధాన రహదారుల్లో కదిలాయి. నెల్లయప్పర్ ఆలయంలో ఆణి ఉత్సవాలు జూన్ 30న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. రోజూ ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవార్లు వివిధ వాహనాల్లో ఊరేగారు. సోమవారం ఉదయం నటరాజస్వామి ఊరేగారు. సాయంత్రం స్వామి గంగాళనాథుడు స్వర్ణ సప్పరంలో ఊరేగారు. రాత్రి 10 గంటలకు స్వర్ణ కైలాస పర్వత వాహనంపై స్వామివారు, స్వర్ణ చిలుకవాహనంలో అమ్మవారు ఆశీనులైన భక్తులకు కనువిందు చేశారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంచ రథోత్సవాలు మంగళవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఐదు రథాలను అందంగా అలంకరించి ఐదుగురు దేవతా మూర్తులను ఆశీనులు కావించారు. ఈ రథాలు ఊరేగే నాలుగు ప్రధాన రహదారులలో ఇటీవలే తారురోడ్డు కూడా నిర్మించారు. మంగళవారం వేకువ జామున స్వామివారు, అమ్మవారు వేర్వేరు రథాల్లో ఆశీనులయ్యారు. ఉదయం 8 గంటలకు స్పీకర్ అప్పావు, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్, జిల్లా కలెక్టర్ ఆర్ సుకుమార్, ఎంపీ రాబర్ట్ బ్రూస్, కార్పొరేషన్ మేయర్ కే రామకృష్ణన్ తదితరులు రథోత్సవాన్ని ప్రారంభించారు. అంతకు ముందు వేకువజాము వినాయకుడు, మురుగప్పెరుమాన్ రథాలను భక్తులు ఊరేగిస్తూ వెళ్లారు. చివరగా చండీకేశ్వర్ల రథాన్ని కూడా ఊరేగించారు. ఈ రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ నిర్వాహకులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. ఐదు రథాలు ఊరేగిన వీధులలో 300లకు పైగా సీసీ కెమెరాలతో పోలీసులు నిఘా వేశారు. రథవీధుల్లో 16 పోలీసు సహాయ కేంద్రాలు కూడా ఏర్పాటు చేశారు. నెల్లై మహానగర పోలీసు కమిషనర్ సంతోష్ హడిమణి నాయకత్వంలో వెయ్యిమందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.


మహారథోత్సవంలో పాల్గొన్న భక్తులు





మహారథోత్సవాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అప్పావు, మంత్రి పీకే శేఖర్‌బాబు, నయినార్ నాగేంద్రన్ తదితరులు - పాల్గొన్న భక్తులు- ప్రత్యేక అలంకారంలో నెల్లయప్పర్

నేత్రపర్వంగా కండదేవి రథోత్సవం

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా దేవకోట సమీపంలోని కండదేవి గ్రామంలోవున్న స్వర్ణమూర్తీశ్వరుడు, పెరియ నాయకి ఆలయంలో ఆణి మాసం ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది నూతనంగా రూపొందించిన రథాన్ని అందంగా అలంకరించి సోమవారం ఉదయం పెరియ నాయకి సమేత స్వర్ణమూర్తీశ్వరర్ ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చారు. వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో రథం ఊరేగింది. గతంలో ఈ గ్రామంలో నిర్వహించిన రథోత్సవంలో ఇరు వర్గాలకు చెందిన ప్రజల మధ్య ఘర్షణలు జరిగిన నేపథ్యంలో సుమారు 2వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే రథం ఊరేగింపులో పాల్గొనే భక్తులు రాజకీయ పార్టీల గురించి, కులనేతల గురించి, మతాల గురించి ప్రస్తావించరాదని జిల్లా అధికారులు పలు ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.


రథోత్సవంలో అశేషభక్తజనం

ఘనంగా యోగాంజనేయస్వామి ఆలయ కుంభాభిషేకం


కుంభాభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు - ఆలయ కలశాలకు కుంభాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుత్తణి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని షోళింగర్‌లో ఉన్న యోగాంజనేయస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవం మంగవారం ఘనంగా జరిగింది. గత ఎనిమిది రోజులనుండి యాగశాలలో అర్చకుల ఆధ్వర్యంలో హోమ పూజలు జరిగాయి. మంగళవారం తెల్లవారుజామున 5గంటలకు యాగపూజలు, పూర్ణాహుతి శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం 7 గంటలకు వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ పవిత్ర జల కలశాలను ఊరేగింపుగా ఆలయ అర్చకులు క్షేత్రానికి తీసుకెళ్ళి గోపుర కలశాలపై సంప్రోక్షించారు. ఈ వేడుకకు జిల్లాలోని ప్రాంతాల నుంచేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, పుంగనూరు, కార్వేటినగరం, పుత్తూరు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి యోగాంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు. ఇదిలా వుండగా, కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆచితూచి మాట్లాడండి

● మాజీ మంత్రి పొన్ముడికి హైకోర్టు సూచన



చెన్నై, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన పదవిలో వున్నప్పుడు మైకు ముందు ఆచితూచి మాట్లాడాల్సి వుంటుందని మాజీ మంత్రి పొన్ముడికి హైకోర్టు సూచించింది. మైకు ముందు మాట్లాడే ప్రతి ఒక్కరూ తామే ఈ దేశానికి చక్రవర్తులమనే గర్వంతో ప్రవర్తించడాన్ని తామెన్నటికీ సహించబోమని, భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో తమకు ఆకాశమే హద్దు అని భావించే రాజకీయ నాయకుల ప్రసంగాలను న్యాయస్థానం చూస్తూ ఊరుకోదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విల్లుపురం సమీపంలో జరిగిన సభలో మంత్రి పొన్ముడి ఓ వేశ్య విటుడి వద్ద శైవ, వైష్ణవ మతస్థులు నుదుట ధరించే చిహ్నాలను సంకేతంగా చేసుకుని డబ్బులు వసూలు చేయడంపై మాట్లాడి ఆ రెండు మతస్థుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ వ్యాఖ్యలపై హైకోర్టు స్పందించి ఆయనపై సుమోటో కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించింది. ఈ కేసు విచారణ న్యాయమూర్తి వేల్ మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు మంగళవారం విచారణకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పొన్ముడికి వ్యతిరేకంగా వివిధ పోలీసుస్టేషన్లలో దాఖలు చేసిన ఫిర్యాదులను వాపసు చేసుకున్నారని ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. ఆ ఫిర్యాదుల వాపసు గురించి పట్టించుకోనవసరం లేదని సుమోటో కేసుపై విచారణ కొనసాగించనున్నట్లు పేర్కొంది. నోటి దురుసు కలిగిన ఇలాంటి వ్యక్తుల నోటికి కళ్లెం వేయాల్సి ఉందని, రాజకీయనాయకులంతా భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో ప్రవర్తిస్తుంటారని, వారిపట్ల ఎలాంటి చర్యలు తీసుకోకుండా కోర్టు మౌనం వహించదని హెచ్చరించింది. ప్రభుత్వం తమకు ఇష్టం లేని వ్యక్తులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తే వాటికి తగు ప్రాథమిక ఆధారాలున్నాయని, ప్రకటించడం, తమకు కావాల్సిన వారికి వ్యతిరేకంగా ఫిర్యాదులు వస్తే వాటికి తగు ప్రాథమిక ఆధారాలు లేవని చెప్పటం పాలకులకు ఆనవాయితీగా మారిందని పేర్కొంది. ఆ తర్వాత కేసు తదుపరి విచారణ ఆగస్టు ఒకటో తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

12 సీట్లడుగుతాం

● ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో

ప్యారీస్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు కోసం డీఎంకే కూటమిలోవున్న తమకు అసెంబ్లీ ఎన్నికల్లో 12 సీట్లు కోరనున్నట్లు ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు. మదురైలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నీటివనరులను కాపాడుకోవడంలో ఎండీఎంకే తరుపున పలు పోరాటాలు చేపట్టి విజయం సాధించినట్లు తెలిపారు. అలాగే స్టెర్‌లైట్ కర్మాగారం మూతపడటానికి కూడా తామే కారణమని, గత 31యేళ్ళుగా ప్రజల సమస్యలపై పోరాడుతూనే ఉన్నామని ఆయన తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 12 నియోజకవర్గాల్లో పోటీ చేసి 8 స్థానాల్లో గెలిస్తేనే తమ పార్టీకి ఈసీ గుర్తింపు లభిస్తుందని, అందువల్ల 12 స్థానాల్లో పోటీ చేయాల్సిన నిర్బంధం వచ్చిందని వైగో తెలిపారు.

ఈ ఏడాది 15 అమృత్ భారత్ రైళ్ల తయారీ



పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీఎఫ్ కర్మాగారంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోగా 15 అమృత్ భారత్ రైళ్ల తయారుచేయాలని నిర్ణయించారు. అలాగే, ఏసీ సబర్బన్ రైళ్ల తయారీ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో పలు డిజైన్లలో 73వేల బోగీలు తయారుచేసి రైల్వే బోర్డుకు అప్పగించారు. ప్రస్తుతం వందే భారత్ రైళ్లను తయారు చేస్తున్నారు. ఇప్పటివరకు ఐసిఎఫ్‌లో తయారైన 88 వందే భారత్ రైళ్లు దేశంలోని పలు మార్గాల్లో నడుపుతున్నారు. ఈ క్రమంలో, అన్నివర్గాల ప్రజలు ప్రయాణం చేసేలా అమృత్ భారత్ రైలు (సాధారణ వందే భారత్ రైలు) తయారవుతోంది. ఇప్పటికే రెండు అమృత్ భారత్ రైళ్లను తయారుచేసి 2023లో రైల్వే బోర్డుకు అప్పగించారు. 20 ప్యాసింజర్ కంపార్ట్‌మెంట్లు, 2 కార్గో కంపార్ట్‌మెంట్లుతో 22 బోగీల ఈ రైలులో నాన్-ఏసీ సీటింగ్, స్లీపర్ బోగీలు, రెండు వైపులా ఆటోమెటిక్ ఇంజన్లున్నాయి. ఈ రైళ్లకు ప్రయాణికుల ఆదరణ పెరగడంతో 200 అమృత్ భారత్ రైళ్లు తయారుచేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ విషయమై ఐసిఎఫ్ అధికారి మాట్లాడుతూ... ఈ ఏడాది ఇప్పటివరకు నాలుగు అమృత్ భారత్ రైళ్లు తయారుచేశామని, ఈ ఆర్థిక సంవత్సరంలో 15 రైళ్లు తయారుచేయాలని నిర్ణయించామన్నారు. అలాగే, గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జూన్ వరకు తలా 12 బోగీలతో కూడిన ఏసీ సబర్బన్ రైళ్లు తయారుచేసి, పలు రైల్వే డివిజన్లకు అందజేశామన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరో 8 ఏసీ సబర్బన్ రైళ్లు తయారు చేయనున్నట్లు ఐసిఎఫ్ అధికారులు తెలిపారు.

ఆమ్నీ బస్సులకు దీటుగా కొత్త రంగులతో రవాణా సంస్థ బస్సులు

టి.నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కొన్ని దశాబ్దాలుగా వివిధ రంగులతో సంచరించిన రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు ప్రస్తుతం ఆమ్నీ బస్సులకు దీటుగా కొత్త రంగులతో ప్రయాణికులకు కనువిందు చేయబోతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ జోన్లలో రాష్ట్ర రవాణా సంస్థ 20,508 బస్సులను నడుపుతోంది. రవాణా సంస్థ తరచూ కొత్త బస్సులను కొనుగోలు చేసి వాటికి ఆకర్షణీయమైన రంగులతో తీర్చిదిద్దుతోంది. అయితే మొదటిసారిగా రాష్ట్ర రవాణ సంస్థ బస్సులో ఆమ్నీ బస్సులతో పోటీ పడేలా కొత్త రంగులతో ప్రధాన రహదారుల్లో తిరగనున్నాయి. విల్లుపురం జోన్‌కు చెందిన రవాణా సంస్థ బస్సులు కొత్త రంగులతో కనువిందు చేయనున్నాయి. ఈ బస్సులు ఎంతటి దూరం నుండి చూసినా స్పష్టంగా కనిపించేలా ఉన్నాయి. ఏసీ సదుపాయంతో సీట్ల వరుసలన్నీ ఇద్దరు ప్రయాణికులు ఇబ్బంది లేకుండా కూర్చునేంత స్థలంతో ఉన్నాయి. మొత్తానికి ఈ బస్సులను చూస్తే ఆమ్నీ బస్సులని అపోహపడేలా ఉన్నాయని చెప్పటం అతిశయోక్తి కాదు.


కొత్త రంగులతో మెరుస్తున్న విల్లుపురం జోన్ రాష్ట్ర రవాణా సంస్థ బస్సు

గూండా నిరోధక దళానికి కమిషనర్ ప్రశంస


గూండా నిరోధక చట్టం విభాగం పోలీసులతో కమిషనర్ అరుణ్

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ప్రతిభ చూపిన గూండా నిరోధక చట్ట విభాగం పోలీసులను గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ అభినందించారు. నగరంలో నేరాలు, చైన్ స్నాచింగ్, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, మహిళలు, పిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అడ్డుకొనేలా నగర పోలీసు శాఖ పలు చర్యలు చేపట్టింది. ఇలాంటి నేరాలకు పదే పదే పాల్పడేవారికి గూండా చట్టం కింద అరెస్ట్ చేస్తున్నారు. పేరుమోసిన నేరస్తులను గుర్తించి, వారిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసేలా ప్రత్యేక విభాగం ఏర్పాటైంది. ఈ విభాగం 2024 జూలై 8 నుంచి ఈ ఏడాది ఈ నెల 7వ తేది వరకు 1,002 మందిని గూండా నిరోధక చట్టం కింద అరెస్ట్ చేసింది. అలాగే, 2024 జూలైలో ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసుకు సంబంధించి 26 మందిని గూండా నిరోధక చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో, ఉత్తమ సేవలు అందిస్తున్న ఈ విభాగం ఇన్‌స్పెక్టర్ అయ్యప్పన్ నేతృత్వంలోని బృందాన్ని మంగళవారం వెప్పేరిలోని పోలీసు కార్యాలయంలో కమిషనర్ అరుణ్ అభినందించారు.

రూ.36 కోట్లతో ఆవడి బస్టాండ్ ఆధునికీకరణ

పెరంబూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి బస్టాండ్‌ను రూ.36 కోట్లతో వాణిజ్య సముదాయంతో కూడిన బస్ టెర్మినల్‌గా రూపొందించనున్నారు. చెన్నై-తిరుత్తణి జాతీయ రహదారిలో భక్తవత్సలపురం ప్రాంతంలో 1.93 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆవడి బస్టాండ్ నుంచి కోయంబేడు, తిరువాన్మియూర్ తిరునల్వేలి తదితర డెల్టా జిల్లాలకు బస్సులు నడుపుతుంటారు. ప్రతిరోజు సుమారు 6 లక్షల మంది ఈ బస్టాండ్‌ను వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో, బస్టాండ్‌ను ఆధునికీకరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) రూ.36 కోట్లతో వాణిజ్య సముదాయంతో ఆవడి బస్టాండ్‌ను ఆధునికీకరించనుంది. రెండంతస్తులతో కూడిన బస్ టెర్మినల్‌లో ఒకే సమయంలో 22 బస్సులు నిలిపేలా ట్రాక్, ఐదు ప్లాట్‌ఫాంలు, 435 ద్విచక్రవాహనాలు పార్కింగ్, 200 మంది కూర్చునేలా వెయిటింగ్ రూమ్, ఆర్వో ప్లాంట్, 22వేల చ.అ వాణిజ్య ప్రాంతం, 10,602 చ.అ పరిపాలన భవనం, ఆధునిక టాయిలెట్లు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. బస్ టెర్మినల్ ఏర్పాటుకు త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్లు అధికారులు తెలిపారు.


ఆవడి బస్టాండ్ నమూనా చిత్రం

ముగిసిన జ్యేష్టాభిషేకం





తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన కవచ సమర్పణ క్రతువుతో జ్యేష్టాభిషేకం ముగిసింది. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని మండపంలోకి వేంచేపుచేశారు. వివిధ క్రతువులు నిరవహించారు. శాత్తుమొర, ఆస్థానం జరిపించి మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 4.30గంటల మధ్య స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కవచ సమర్పణ పూర్తిచేశారు. సాయంత్రం ఉభయనాంచారులతో స్వామివారు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చివరిరోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సవర్లను దర్శించుకున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

అమ్మవారి సేవలో చెన్నై హైకోర్టు సీజే

తిరుచానూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి):పద్మావతి అమ్మవారిని మంగళవారం చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం తమిళనాడు బీజేపీ నేత అన్నామలై కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలయం వద్ద జస్టిస్ కేఆర్ శ్రీరామ్

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఒక షెడ్‌లో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.48 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 80,081
తలనీలాలు సమర్పించినవారు: 28,775



చరమాంకంలోనూ చెదరని సంకల్పం

● పురాతన కరెన్సీ, నాణేల సేకరణ హాబీ ● 75 ఏళ్ల వయసొచ్చినా అదే అభిరుచి



కణన్ షణ్ముగం, సేకరించిన నాణేలు, కరెన్సీ

కోట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): 75ఏళ్ల వయసులోనూ తన అభిరుచి కోసం పరితపిస్తున్నారాయన. పురాతన నాణేలను,కరెన్సీని సేకరించాలని పట్టుదలతో ముందడుగు వేస్తున్నారు. ఈక్రమంలోనే కోట మండలం చిట్టేడు గ్రామానికి ఇటీవల వచ్చారు కణన్ షణ్ముగం. తన విశేషాభిరుచి గురించి ఆయన ఆంధ్రజ్యోతితో పంచుకున్నారిలా.. మాది చిత్తూరు. మానాన్న తమిళనాడులోని రాయవేలూరులో స్థిరపడ్డారు. నేను 1973-74ప్రాంతంలో ఇండియా తరపున ఫుట్‌బాల్ ఛాంపియన్‌గా వ్యవహరించాను. పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. భార్య చెన్నైలో ఉంది. నాకు పురాతన నాణేలు,వివిధ దేశాల కరెన్సీ సేకరించడమంటే ప్రాణం. ఈక్రమంలోనే 50 ఏళ్లుగా చాలా దేశాల్లో తిరిగాను. ఆయా దేశాలకు సంబంధించి 700 నుంచి 800 ఏళ్ల నాటి కరెన్సీ నోట్లు, నాణెలను సేకరించాను. అమూల్యమైన నాణేలను ఇప్పటికీ చెక్కు చెదరకుండా భద్రపరిచాను. నాదగ్గరున్న యూకే నాణేలు చాలా ఖరీదైనవి. పురాతన కరెన్సీ, నాణేలను ఆయా దేశాల మ్యూజియంలకు అప్పగించాలనేది నా సంకల్పం. మూడు నెలలుగా చిట్టేడు విద్యానగర్‌లోని స్నేహితుడి ఇంటి వద్ద ఉంటున్నాను. పురాతన నాణేల సేకరణలో భాగంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో తిరుగుతున్నాను. ఈగ్రామ ప్రజలకు పురాతన నాణేలు,కరెన్సీ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు షణ్ముగం వివరించారు.

తిరుమలలో మళ్లీ తట్టల జోరు

● కొత్తగా 20 తట్టలకు అనుమతి?

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా తిరుమల కొండమీద కొందరి దందా మాత్రం యధాతధంగానే కొనసాగుతోంది. తిరుమలలో అనధికార తట్టలు(చిన్నపాటి అంగళ్లు) నిదానంగా విస్తరిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కావలసినవారికి, కోరుకున్న చోట ఇష్టానుసారం తట్టలకు అనుమతులు ఇచ్చేశారు. కోట్లరూపాయలు చేతులు మారినట్టు దీని మీద అనేక ఆరోపణలు కూడా వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీటీడీ ప్రక్షాళనలో భాగంగా అనధికార తట్టలకు అవకాశం ఉండబోదని అనుకున్నారు. అలాగే అనుమతి ఆధారంగా ఇష్టమొచ్చిన వ్యాపారాలు చేసుకోవడానికి కూడా వీలుండదని భావించారు. కొద్ది రోజులు పరిస్థితి మారినట్టు కనిపించింది. విజిలెన్స్ విభాగం ఈ అంశంపై విచారించి తట్టలకు అనుమతుల జారీలోనూ, స్థల మార్పిడిలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకున్నట్టు ఒక నివేదిక కూడా ఇచ్చింది. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో తట్టలు కూడా తొలగించడంతో ఇక పద్ధతి ప్రకారమే అంతా జరుగుతుందని అనుకున్నారు. అయితే మళ్లీ అంతా మొదటికొచ్చింది. అనధికార తట్టల వ్యాపారాల జోరు పెరిగింది. తాజాగా, వరాహస్వామి, పాత అన్నప్రసాద కేంద్రం ప్రాంతాల్లో దాదాపు 20 తట్టలు ఏర్పాటు చేసుకునేందుకు రెవెన్యూ విభాగం అనుమతులు జారీ చేసినట్టు తెలిసింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వీరికి అనుమతి ఎవరిచ్చారు, ఎందుకు ఇచ్చారు అంటూ ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది. తట్టల వ్యాపారం అదుపు తప్పితే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది.

ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), జూలై 8(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం రవాణా కేసులో నిందితునికి ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ ఫారెస్ట్ బీటు అధికారి ఖ్యాతి తెలిపిన వివరాల మేరకు ఎర్రావారిపాళెంకు చెందిన ఎస్.బాలసుబ్రహ్మణ్యం 2016లో తలకోన సెంట్రల్ బీట్ నుంచి ఐదు ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. ఈకేసు తొమ్మిదేళ్లుగా దర్యాప్తు దశలో ఉంది. తాజాగా ఏపీపీ బాలకృష్ణ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ ప్రదీప్‌చంద్, డీఆర్వో బాబుప్రసాద్‌లు న్యాయమూర్తి ఎదుట సాక్షాధారాలను నిరూపించారు. దీంతో మంగళవారం నిందితునికి ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు



రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల దుర్మరణం

● పాల ట్యాంకర్‌ను ఢీ కొన్న కారు ● మరో ఇద్దరికి గాయాలు







రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పద్మ - చికిత్స పొందుతూ మృతి చెందిన జశ్వంత్‌సాయి - గాయపడిన హేమలత

చంద్రగిరి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తొండవాడ జాతీయ రహదారిలో పాల ట్యాంకర్‌ను కారు ఢీకొన్న దుర్ఘటలో తల్లి కొడుకు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు విజయవాడకు చెందిన కోటేశ్వరరావు, భార్య పద్మ(40), కుమారుడు జశ్వంత్‌సాయి(14), సోదరి హేమలతలు కారులో తిరుణామలైకు వెళ్లారు. ఈక్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కారు కోటేశ్వరరావు నడుపుతున్నారు. పక్క సీటులో కుమారుడు జశ్వంత్ సాయి, వెనుక సీటులో పద్మ, హేమలతలు కూర్చొన్నారు. తొండవాడ సమీపంలోని పూతలట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న పాల ట్యాంకర్‌ను వీరి కారు వేగంగా వెళ్తూ ఢీకొంది. దీంతో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారు వేగంగా ఢీకొనడంతో బెలూన్‌లు కూడా ఓపెనయ్యాయి. పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. జశ్వంత్ సాయి, హేమలతలకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ఇరుక్కుపోయిన జశ్వంత్ సాయి, హేమలతలను స్థానికులు బయటకు తీశారు. వెంటనే అంబులెన్స్‌లో వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జశ్వంత్ సాయి మృతి చెందాడు. పద్మ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కోటేశ్వరరావు కోలుకుంటున్నారు. ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్ బాషా ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు నెలలుగా ఏం చేశావ్ జగన్?

● రైతులను ఆదుకోవాలంటే మీ నేతల ఫ్యాక్టరీల్లో రూ.12కి కొనిపించండి
● రైతు సంఘం నాయకుల సలహా

తిరుపతి(ఆటోనగర్), జూలై 8 (ఆంధ్రజ్యోతి): 'రెండు నెలలుగా ఏం చేశావ్. ఇప్పుడు పంట వడిగి పోతున్న సమయంలో బంగారుపాళ్యం వచ్చి రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడటం వల్ల ఒరిగేది ఏమీ లేదు. రైతులను ఆదుకోవాలనుకుంటే.. జిల్లాలో మీ నేతలకే ఎక్కువ గుజ్జు పరిశ్రమలు ఉన్నాయి. ఇప్పటినుంచైనా వారిచేత రూ.12కు కొనిచ్చేలా ప్రకటన చేయండి' అంటూ టీడీపీ రైతు సంఘం నాయకులు సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సాయంత్రం పి.నాగేశ్వర్ రాజు, శివకోటేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు.ఈ ఏడాది అంచనాల కంటే లక్ష టన్నులు అదనంగా పంట వచ్చిందన్నారు. దీనిని గ్రహించే తాము మార్చి నుంచే మామిడి రైతులతో పలుదఫాలు చర్చలు జరిపి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.ప్రభుత్వం స్పందించి టన్నుకు రూ.నాలుగు వేలు చెల్లించడానికి అంగీకరించిందన్నారు. అధికారులతో, గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలతో పదే పదే చర్చలు జరిపి మామిడి పంటను పూర్తిగా కొనేలా ఆదేశాలిచ్చారన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రిగా వున్న మీరు రైతులకు చేసిన మేలు ఏమిటని వారు ప్రశ్నించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రణాళికాబద్దంగా వ్యవహరిస్తూ రైతులను ఆదుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె.గోపీనాథ్ రెడ్డి, టి.ప్రకాష్ నాయుడు, పి.చిన్నారెడ్డి, కె.సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రైతు సంఘ నాయకులు



నల్లపరెడ్డిపై చర్యలేవీ జగన్?

● టీడీపీ నేతల నిరసన

తిరుపతి, జూలై8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన నీచ వ్యాఖ్యలపై జగన్‌రెడ్డి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమంటే మహిళలను అవమానించడమేనని టీడీపీ నేతలు మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం తిరుపతిలో నిరసన తెలిపారు. జగన్ రెడ్డి అండతోనే వైసీపీ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ విమర్శించారు. మహిళల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా ప్రసన్నకుమార్‌రెడ్డి దిగజారుడు మాటలపై మహిళాలోకం ఆగ్రహంతో ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, పాటకం వెంకటేష్, రామ్మూర్తి రాయల్, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, అనిత తదితరులు పాల్గొన్నారు.

గదులు కేటాయించే ఎంబీసీ వద్ద భక్తుల మధ్య ఘర్షణ

● విజయవాడ భక్తుడిపై రాళ్లు విసిరిన ఇంటర్ విద్యార్థి

తిరుమల, జూలై8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గదులు కేటాయించే ఎంబీసీ34 వద్ద ఇద్దరు భక్తుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో సహనం కోల్పోయిన ఓ ఇంటర్ విద్యార్థి రాళ్లు విసరడంతో విజయవాడకు చెందిన ఓ భక్తుడు గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. తిరుపతికి చెందిన మోహన్‌కృష్ణ ఇంటర్ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి శ్రీవారి దర్శనార్థం మంగళవారం తిరుమలకు వచ్చాడు. గది పొందేందుకు ఎంబీసీ34 కౌంటర్ వద్దకు వెళ్లారు. విజయవాడకు చెందిన రవిప్రసాద్ కూడా గది తీసుకునేందుకు ఎంబీసీ34కు చేరుకున్నాడు. క్యూలైన్‌లో రాకుండా రాంగ్‌రూట్‌లో వచ్చేడనే కారణంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటలు పెరిగి బూతులు తిట్టుకునే వరకు చేరుకోవడంతో సహనం కోల్పోయిన మోహన్‌కృష్ణ పక్కనే ఉన్న చిన్నపాటి రాళ్లతో రవిప్రసాద్‌పై విసిరాడు. దీంతో రవిప్రసాద్ ఛాతీపై చిన్నగాయమైంది. దీంతో అక్కడి ఉద్యోగులు పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకునేలోగా మోహన్‌కృష్ణ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అతడి స్నేహితుల ద్వారా పోలీసులు మోహన్‌కృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఘర్షణలకు పాల్పడితే ఆధార్ బ్లాక్ చేస్తాం

సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు తోటి భక్తులను ఇబ్బంది పెడుతూ త్వరితగతిన గదులు పొందాలని ప్రయత్నించినా.. ఘర్షణకు పాల్పడినా వారి ఆధార్ కార్డులను బ్లాక్ చేస్తామని టీటీడీ హెచ్చరించింది. ఎంబీసీ34 గదుల కేటాయింపు వద్ద భక్తుల మధ్య ఘర్షణ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఈ ప్రకటన చేసింది. 'భక్తుల రద్దీ సాధారణంగాఉంది. గదులు అందుబాటులోనే ఉన్నాయి. అయినా సిఫార్సు లేఖలు కలిగిన భక్తులు సహనాన్ని కోల్పోయి ఘర్షణ వాతావరణం సృష్టించడం బాధాకరం. హిందూ ధార్మిక క్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత' అని ఆ ప్రకటనలో పేర్కొంది.

ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోండి

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), జూలై 8(ఆంధ్రజ్యోతి): పి4లో భాగంగా ప్రతి జిల్లా అధికారి ఒక బంగారు కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం వివిధ శాఖ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ శనివారం లోపు ప్రతి రెవెన్యూ డివిజన్‌లో కనీసం 20మందికి తక్కువ కాకుండా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. తానూ కలెక్టరేట్ సమీపంలోని నక్కల కాలనీలో మూడు కుటుంబాలను గుర్తించామన్నారు. ఇక అన్నదాత సుఖీభవ పథకం కింద 17వ తేదీన నగదు విడుదల చేయాలన్నారు. 1 నుంచి ఇంటర్ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు కలిసి ఈ నెల 10 జరిగే మెగా పేరెంట్స్ , టీచర్స్ మీటింగ్2.0ను పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. పీజీఆర్ఎస్‌లో సమస్యలకు గడువులోపు పరిష్కారం చూపకుంటే అందుకు వివరణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ రోజ్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తిరుపతి(ఆటోనగర్), జూలై8(ఆంధ్రజ్యోతి): పదేళ్ళుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయిలో బుధవారం కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, రైతులు, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు నిరసనలు తెలియ జేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధించి పాలకులకు కనువిప్పు కలిగేలా ఆందోళనలు చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తూ, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.రామానాయుడు,శివరెడ్డి, పి.మురళి, సి.పెంచలయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యమా.. సహకారమా?

● ఒకరి బీమా సొమ్ము మరొకరి ఖాతాకు జమలో అధికారుల పాత్ర ఎంత?

పెళ్లకూరు/నాయుడుపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో బీమా తీసుకుంది ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు వెంకటేశ్వర్లు. మెచ్యూర్ సొమ్ము జమైంది ఆరూరు సిద్దయ్య కుమారుడు వెంకటేశ్వర్లు బ్యాంకు అకౌంట్‌కు. వీరిద్దరికీ పెళ్లకూరు మండలం జీలపాటూరు గ్రామమే. బంధువులే. ఇలా ఎల్ఐసీకి తప్పుడు బ్యాంకు ఖాతా వివరాలిచ్చి రూ.19.87 లక్షలు కాజేసిన ఘటనలో అధికారులది సహకారమా.. నిర్లక్ష్యమా అనేది తేలాల్సి ఉంది. బాధితుడికి వడ్డీసహా డబ్బులిస్తామని చెబుతున్న అధికారులు బాధ్యులపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. పెళ్లకూరు మండలం జీలపాటూరుకు చెందిన ఆరూరు వెంకటసుబ్బయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పాలసీ మెచ్యూర్ సమయం ముగిసింది. ఈ రూ.19,87,500 లక్షలు రావాలి. మే నెల 9న తన బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్ తదితరు ధ్రువీకరణ పత్రాలను నాయుడుపేట ఎల్ఐసీ కార్యాలయంలో సమర్పించారు. జూన్ 27న ఆయన బ్యాంకు ఖాతాకు నగదు జమవుందని తెలిపారు. అయితే, జూలై ఒకటి వరకూ నగదు జమ కాకపోవడంతో ఆరూరు వెంకటేశ్వర్లు ఎల్ఐసీ కార్యాలయానికి వెళ్లి వాకబు చేశారు. తనకు జమ కావాల్సిన నగదు జూన్ ఆరో తేదీన తమ సమీప బంధువైన ఆరూరు సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు ఖాతాకు జమ చేసినట్లు తెలిసి కంగుతిన్నాడు. రెండు నెలలు కిందటే అన్ని వివరాలు ఇచ్చినా వేరే వారి ఖాతాకు ఎలా నగదు బదిలీ అయిందని నిలదీయగా, ఎక్కడ ఏం జరిగిందో తెలుసుకుని న్యాయం చేస్తామని నచ్చజెప్పినట్లు తెలిసింది. ఎల్ఐసీ అధికారుల విచారణలో సిద్దయ్య కుమారుడు ఆరూరు వెంకటేశ్వర్లు పేరిట నాయుడుపేటలోని బ్యాంకు ఖాతాలో జమయినట్లు గుర్తించినట్లు తెలిసింది. ఎల్ఐసీలోని కొంతమంది సిబ్బంది ద్వారా తన తండ్రి ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి సిద్దయ్య) ఆధార్, పాన్, మొబైల్ నెంబర్ల వివరాలను ఆరూరు జ్ఞానేంద్ర ఇచ్చి.. ఆరూరు వెంకటేశ్వర్లు (తండ్రి వెంకటసుబ్బయ్య) ఎల్ఐసీ ఖాతాకు లింకు చేసినట్లు సమాచారం. తన తండ్రి ఖాతాలో జమయిన నగదును తన ఖాతాలోకి మార్చుకుని అనంతరం రూ.10 లక్షలు తన భార్య, రూ.9 లక్షలు తన అత్త పేరుమీద అతడు చాకచక్యంగా మార్చుకున్నట్లు తెలిసింది. నాయుడుపేట ఎల్ఐసీ అధికారులు ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యాలయానికి వివరాలను తెలియజేశారు. ఇలా ఎల్ఐసీ అధికారులను బురిడీ కొట్టించిన వ్యక్తిని.. అతడికి సహకరించిన ఎల్ఐసీ సిబ్బంది పైనా ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని బాధితుడు వాపోయారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారించి భవిష్యత్తులో మరొకరికి ఇలాంటి అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నారు. కాగా, ఇందులోని బాధ్యులు.. బాధితుడి బ్యాంకు ఖాతాలో నగదు జమచేయించేలా చర్యలు చేపట్టినట్లు తెలిసింది. మరి, బాధ్యులపై ఎలాంటి చర్యలుంటాయో చూడాలి.

మూడు మార్గాల్లో 48 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో వుంచుకొని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-హిస్సార్‌ల మధ్య నడుస్తున్న వారాంతపు రైళ్లను సెప్టెంబరు వరకు పొడిగించింది. అలాగే కాచిగూడ-తిరుపతిల మధ్య 8 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. తిరువణ్ణామలైలో కొండ చుట్టూ తిగడానికి భక్తుల రద్దీ పెరగడంతో, నరసాపూర్ -తిరువణ్ణామలై ల మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

తిరుపతి-హిస్సార్‌ల మధ్య 24 వారాంతపు రైళ్లు

● తిరుపతి-హిస్సార్ మధ్య వారాంతపు రైళ్లను బుధవారం నుంచి సెప్టెంబరు 28 వరకు పొడిగించారు.తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07717) ప్రతి బుధవారం బయలుదేరి రెండవ రోజుకు హిస్సార్ చేరుకొంటుంది.హిస్సార్‌లో ఈ ప్రత్యేక రైలు (07718)ప్రతి ఆదివారం బయలుదేరి వచ్చిన మార్గంలోనే తిరుపతికి చేరుకుంటుంది.

కాచిగూడ -తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లు

● కాచిగూడలో ఈ నెల 10,17,24,31,తేదీల్లో ప్రతి గురువారం ఈ ప్రత్యేక రైలు(07653) బయలు దేరి మల్కాజ్‌గిరి, జనగాం, గూడూరు మీదుగా తిరుపతికి మరుసటి రోజుకు చేరుకొంటుంది. తిరుపతిలో ఈ నెల 11, 18, 26, ఆగస్టు1వ తేదీల్లో ఈ రైలు(07654) బయలుదేరుతుంది.

నరసాపూర్-తిరువణ్ణామలై మధ్య 16 ప్రత్యేక రైళ్లు

● నరసాపూర్‌లో ఈ నెల 9, 16, 23, ఆగస్టు6, 13, 20, సెప్టెంబరు 3, 24 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు (07219) బయలుదేరి విజయవాడ, తెనాలి, తిరుపతి, చిత్తూరు, వేలూరు మీదుగా మరుసటి రోజు తిరువణ్ణామలైకి చేరుకొంటుంది. తిరువణ్ణామలైలో ఈ నెల 10, 17, 24, ఆగస్టు 7, 14, 21, సెప్టెంబరు 4, 25 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు(07220) బయలుదేరి మరుసటి రోజు నరసాపూర్‌కు చేరుకుంటుంది.